

# వ్యసనం

నరసయ్య గారు సంసారమనే బండి లాగేందుకు మంచి మార్గాలు చూసి, రాజమార్గాన పోయేవారిని చూసి ఒడిదుడుకులను స్పోర్టివ్‌గా తీసుకుంటూ దరిద్రమనేదాన్ని దరి చేరనీయక, దైవాన్ని మరవక బండి తోలుతున్నాడు. సందులు దూరనేల మనసా అని మనస్సుని హెచ్చరిస్తాడు.

విద్యా, వృత్తీ అనేవి ఉన్నాయి. వాటి మీద ధనార్జన చేయటం రావాలి. నేర్పు కావాలి. మెళుకువలు తెలియాలి.

గొప్ప గాయనీమణికి, ''భారతరత్న'' అనే బిరుదు పట్టా యిస్తే, భర్త ముఖచిత్రం ముందుంచి దణ్ణం పెట్టింది. పత్రికా విలేఖరులడిగితే ''నాదేమున్నది? విద్య నేర్చానంతే. దాని విలువ, దాన్ని వాడటం, దాని మీద ధనార్జనా, ఆ ధనాన్ని విద్య, ప్రజాసేవకూ, మతం నిలుపు కోవాలనీ శ్రమించింది నా భర్త గారే. ఈ బిరుదు ఆయన శ్రమకే చెందుతుంది'' అన్నది.

వృత్తి మీద, నేర్పూ మెళుకువలూ వుపయోగించి ఆర్జన చేయాలి. నరసయ్య తన బండి యెత్తు పల్లాలు దాటిపోవాల్సి వస్తే ''సోవాట్! మేలు చక్రాలేద్దాం'' అన్నాడు. మనస్సు వురకలు వేస్తే కళ్లెం వేస్తాడు. ''కళ్లెమ్ము వదిలితే కంచెలో పడద్రోయు కళ్లు తేలేస్తావు జనుడా'' అని పాడుతూ బాలెన్సు నిలుపుతాడు. అయినా మనసు లూర్ చేస్తు ''అలా తిరిగొద్దాం రా'' అంటుంది. ''రాను. నువే పోయి బలాదూర్ తిరిగి రా'' అంటాడు. సందుగొందులో దూరి వస్తే చావగొట్టి చెవులు మూస్తాడు.

యింటి ముందు ఖాళీ స్థలంలో పందిరి కింద మంచం మీద కూచుని నరసయ్య పంచాంగం చూస్తున్నాడు. గోచారం, కందాయ ఫలం, రాజ గౌరవం, అవమానం, ఆదాయ వ్యయాలు, బల్లి పతనం, బల్లి శకునం, గ్రహగతులూ, పదకొండింట సూర్యుడుంటే ప్రయాణం అని చూస్తున్నాడు. జన్మ నక్షత్రం చూసి యే పేరు పెట్టాలో చదువుతున్నాడు. చూచే చోలా అశ్వనీ, వావీవేవో భరణి

అలా, భరణి నక్షత్రం జన్మ నక్షత్రమైతే, వాసుదేవ, వీరయ్య, వేంకట్రావు వోబయ్య అలా, అమ్మాయి అయితే వాసంతి, వసుమతి, వీరకుమారి, వెంకమ్మ, వేదవల్లి, ఓంకార లక్ష్మి అలా పెట్టాలి పేర్లు.

చప్పుడు విని తలెత్తి చూశాడు నరసయ్య. గేటు తీసుకుని ఒకాయన ఒకమ్మాయిని వెంటబెట్టు కొస్తున్నాడు.

''అలా కుర్చీల్లో కూచోండి. మనం అపరిచితులమే. నేనెలా తెలుసు? యెవరు పంపారు? వారికెవరు రికమెండ్ చేశారు? నాతో పనేమిటి? నా యిల్లు పావనమైంది'' అన్నాడు. వాళ్లిద్దరూ కూచున్నాక పరిశీలించాడిద్దర్నీ.

''యేదో మానసిక వేదనకు వశమైనట్టున్నారే? మంచి తీర్థమిత్తునా'' అన్నాడు. ఫార్మాలిటీస్ వెల్లడించాడు.

చెప్పులు వదిలి వచ్చారిద్దరూ. ''యివ్వండి'' అన్నాడు తండ్రి. సాయంత్రం అయిదున్నరయింది. నీరెండ పడుతున్నది.

నిలబడి యింటి లోపలికి చూశాడు నరసయ్య. కూతురు శివకామి ''కొబ్బరి నీళ్లు లోటాల్లో పోసి తెస్తున్నాను నాన్నా. బసవన్న బోండాలు దింపాడు. గునపం తల్లకిందులుగా పాతి పెచ్చుతీస్తున్నాడు. కొడవలితో బెజ్జం వేసి యివ్వగానే గిన్నెలకొంచి తెస్తా'' అని దొడ్డివేపు వెళ్లింది.

''అదుగో గాబు, చల్లని నీళ్లున్నాయి. పక్కనే చెంబు. కాళ్లూ చేతులు కడుక్కు రండి. చాలా దూరం నించి నడిచి వచ్చినట్టున్నారే?''.

''అవునండీ'' అంటూ మొహం పైబట్టతో అద్దుకుంటూ వచ్చి కూచున్నాడు. అమ్మాయి కొంగుతో అద్దుకున్నది.

కొబ్బరి నీళ్లు లోటాల్లో పళ్లెంలో వచ్చినై. వారికెదురుగా యెత్తు పీట మీదుంచింది శివకామి. పదోయేడు. జరీ అంచున్న పట్టుపరికిణీ ఆకుపచ్చది. అదే రంగు జాకెట్టూ, మొహాన తిలకం. కళ్లకు కాటుక గీరలు. మెళ్లో తావళం. చేతులకు గాజు గాజులు. గోరింట గోళ్లూ. జడా జడకుప్పెలూ, తల్లో

చంద్రకాంత పూలదండా. లోపలికెళ్లింది.

''తీయగా వుండి సేద దీర్చాయండి కొబ్బరి నీళ్లు''.

''అవి నీళ్ల కాయలు. కొబ్బరి కోసం గాదు వేసింది. లేత కొబ్బరి తినండి. తెస్తుందమ్మాయి. వెన్నలాగా వుంటుంది''.

మరో పెళ్లెంలో రెండేసి భాగాలు చేయబడి బొండాలొచ్చాయి. తురిమి తినేందుకు చెమ్చాలూ.

''తీసుకొండి'' అని పక్కన నిలబడింది శివకామి.

తండ్రీ కూతురు వెన్నవంటి కొబ్బరి తిన్నారు.

శివకామి పళ్లెం పట్టుకెళ్లి దొడ్లోపెట్టి మళ్లా వచ్చింది. ''మా పూలతోటా, కూరపాదులు, అరిటి చెట్లు, కొబ్బరి చెట్లూ, నాగమల్లి తీగా, చెంగలువ, దిల్‌బహార్ పూలు చూపిస్తారా'' అని చెయ్యిపట్టుకున్నది కొత్తలేకుండా.

''పో అమ్మా! చూసిరా'' అన్నాడు తండ్రి. కూతురు వెళ్లింది.

''నామ ధేయం?'' అనడిగారు నరసయ్య నవ్వుతూ.

''నా పేరు రామగోపాలం. కోర్టులో నాజరు వుద్యోగం, రిటైర్ కాబోతున్నా. అలా వెళ్లినమ్మాయి మూడవ బిడ్డ. మొదటి అమ్మాయికీ అబ్బాయికీ పెళ్లిళ్లు చేశాను. ఈ బిడ్డతో కొంత యిబ్బంది వచ్చింది. సంబంధాలేమో చూశాను. చేసుకుంటామనీ అంటున్నారు. బిడ్డని మీరూ చూశారు''అన్నాడు విచారంగా.

''యిబ్బంది తెలుసుకుందాము''

''సంగీతం మెయిన్‌గా గ్రాడ్యుయేట్ అయింది. వయస్సు యిరవై. ఆడపిల్లల బళ్లో సంగీతం టీచరుగా వుద్యోగము తెచ్చుకున్నది. డాక్టర్లను సంప్రతించాను. యేమీ చెప్పలేదు వారు''.

''నేను వైద్యుడిని కాదే'' అన్నాడు నవ్వాపుకుంటూ.

''కాదనుకోండి. మంచి జనరల్ నాలెడ్జ్ గలవారని విన్నాను. పరిష్కార

మార్గం విందామని వచ్చాను''.

''సమస్య వినదుద్దా ?'' సంశయమెందుకో అనుకున్నాడు.

''చెప్తున్నా. బిడ్డ చిన్నప్పటినించే, యెదుటి బిడ్డ చేతులోది లాగేయటం, ఇవ్వకపోతే యేడిపించటం. కొట్టేదిగాదు గానండీ యెలాగో లాగేసేది మొత్తానికి. ఎలిమెంటరీ స్కూల్లో వున్నప్పుడే కంప్లెయింట్స్ వచ్చాయి. వాళ్లమ్మ అప్పుడే దిద్దుబాటు పద్ధతులు వాడింది. కొట్టటం, బాదటం, చెవి మెలిపెట్టడం, బుగ్గలు గిల్లటం, అన్నం పెట్టక గదిలో పెట్టి తాళం వేయటం. అవీ పద్ధతులు. చూడలేక ''తెలిసీ తెలియని యీడు'' అని రీజన్ చేస్తే, ''మొక్కై వంగనిదీ మానై వంగుతుందా?'' అని వురిమేది తల్లి. బిడ్డ చదువులో వెనకబడలేదు. ముఖ్యంగా అరిథ్‌మెటిక్. మేష్టర్నే దిద్దేది. నోటి లెక్కలు. నల్లబల్ల మీద స్టెప్ బై స్టెప్ లెక్క చేసి ఆన్సరు తెచ్చి చూపేది క్లాసుకి. క్లాసు మానీటరైంది. హైస్కూల్లో నింద పడింది. బెల్లించి కాజేస్తుందట లేదా బాగా ఖర్చు చేయించి అంతా వదిలిస్తుందనీ తోటిపిల్లలు హెడ్‌మిస్ట్రెస్‌తో కంప్లెయింట్ చేశారు. ఇంటి కొచ్చిపోయే బంధువులు గూడా, ''యెట్లా లాగేస్తుందోగాని నర్సయ్యా! రిక్తహస్తాలతో మిగులుతాం. దీనికెలాటి మొగుడొస్తాడో!''. యేమనాలీ? శిక్షలకు వెరవదు. కళ్లూ వళ్లూ వప్పజెప్పేది తల్లికి. ఖర్మ యిపుడు తల్లి లేదు. పెళ్లి చేస్తే మొగుడేం చేస్తాడో! ఒదిలేస్తాడేమో. తగాదా పెడ్తాడేమోనని వెరుస్తున్నా. డబ్బు విషయమని మరీ దిగులు. మారదేమో. ఈ మిషతో అల్లుడు నా వద్ద నించి గుంజచ్చు. పోనీ బిడ్డ తానే చూసుకోదు'' అని చూశాడు తండ్రి.

''అది జబ్బు గాదు. వ్యసనం. స్పోర్టివ్‌గా తీసుకోవాలి. మనకు సప్తవ్యసనాలెప్పుడో చెప్పబడ్డాయి. దీన్ని మోడరన్ వ్యసనం అందాము. ఎడ్డిక్ట్ అంటారు చూడండీ, అలా అన్నమాట. నిషానిస్తుందన్న మాట. అది అందకపోతే విలవిలలాడుతారు ఎడ్డిక్ట్స్. ఆ మందు ప్రభావం వల్ల యేం చేస్తున్నారో వాళ్లకే తెలియదు. నిషా దిగాక యేమి చేశారో చెప్పలేరు. వాటి పేర్లు వినే వుంటారు''.

'' ఆ. ఆ. విన్నాను. అట్టి వారిని చూశాను. ''నవ్వటానికి ప్రయత్నిస్తూ

గోపాలం గారన్నారు. ''నేను బయలుదేరిన వేళ మంచిది, మీ అమ్మాయి మా అమ్మాయిని యిక్కడినించి తీసికెళ్లింది. యెలా చెప్పనా అని దిగులుపడ్డా'' యెలాగైతేనేం నవ్వు మొహం పెట్టాడు గోపాలం గారు. ''చెప్పాను గదూ. జనరల్ నాలెడ్జ్‌గలవారనీ. మార్గం గూడా సెలవీయండి పెళ్లి ఆపేయనా?''

''అక్కర్లేదు'' అన్నాడు నరసయ్య.

''జర్మనీ పంపనా అమ్మాయిని? నా దాయాది అన్న వున్నాడక్కడ టెక్నీషియన్. ఆ దేశీయురాలే పెళ్లాడింది మా అన్నను. ఒకానొక స్టార్, ప్రొడ్యూసర్ అండ్ డైరెక్టర్ తన బిడ్డను అక్కడికి పంపించారని విన్నాను'' అని నవ్వు వెలిగించాడు గోపాలంగారు. ''వ్యసనం కుదిర్చారనే చెప్పుకున్నారు తారలు. కాని వేరే వ్యాపకంలో వున్నా గూడా ఆ బిడ్డ కొత్త రకం నేరాల్లో యిరుక్కున్నాడని, ప్రొడ్యూసర్ దిగులు పడ్డారనీ పత్రికలు ఘోషించాయి. నేనూ విచారించాను'' అని నవ్వాడు.

''దిగులుపడి లాభం లేదు. స్పోర్టివ్‌గా తీసుకుంటే లాభిస్తుంది. మీరు గ్రంథ పఠనం చేయాలి. హెడ్‌లైన్స్ చదివి అవతలికి విసిరేయక దినపత్రికలు డిటెయిల్డుగా చదవాలి. కోర్టు మూస్తారు. కోర్టుకీ శలవులుంటాయి. అపుడు వోపక డబ్బా వాడుతూ దేశాటన చేసి రావాలి. బిడ్డకు దైవభీతి అలవాటు చేసి సాధన చేయించాలి''.

''గ్రంథపఠనమెందుకూ? కంటి అద్దాలతో యాతన. దేశాటనకి బిడ్డవాసంతినీ వెంటబెట్టు కెళ్లనా?'' విచారం దిగులూ తగ్గి హాస్యమాడగలిగారు గోపాలం గారు.

''వస్తానంటే తీసికెళ్లండి. బలవంతం వద్దు. కాని ముఖ్యంగా ఖర్చులామే పెట్టుకోవాలని చెప్పండి. తనపైసా వాడుతుందా తెలిసిపోతుంది. మీరు మనుషుల్ని పరిశీలించినట్లు లేదు. సంసారమూ సంపాదనలో లీనమై వుండాలి''.

''బాగా చెప్పారు. నన్ను గురించి తెలిసినట్టే చెప్పారు''.

''రామకృష్ణ కవి, ఆంధ్ర భోజుని ఆస్థానంలో వికటకవి అని బిరుదు పొందినవాడు. మనుషుల్ని స్టడీ చేసి సైకాలజీలో నిష్ణాత అయినవాడు గనకనే రాయల్ని క్రైసిస్ నించి బైటపడేసేవాడు. నసాళానికంటే హాస్యం వాడి బుద్ధి చెప్పేవాడు. అదొక విధంగా రాయలు రోగం కుదర్చటమే. డయాగ్నొసైజ్ చేయటంలో నేర్పరి అని, స్పెషలిస్ట్ అన్నా అనచ్చు. మీరాయన కథలు చదవ లేదా? వినలేదా?''

''అన్నీ వినలేదు. అన్నీ చదవలేదు. అన్నారుగా సంపాదనలో లీనమైనానని. సినిమా చూశాను. మీరు రెండు చెప్పండి వింటాను''. గుండె మీది బరువు, గుండెలో గుబులు తగ్గినట్టు ప్రసన్నంగా వున్నారు గోపాలం గారు.

''బార్బర్ తనను మెప్పిస్తే యేం కావాలి అని అడిగాడు రాయలు. బ్రాహ్మడిని చేయించండి ప్రభూ నన్ను అని కోరితే దర్బారులో బ్రాహ్మలకి రాజాజ్ఞ యిచ్చాడు రాయలు. మా అగ్రహారాలన్నీ తింటున్నారు. వీరన్నని బ్రాహ్మడిని చేయండి''. మంచి బెడదే పట్టుకున్నదే అని యేం చేయాలో పాలుపోక రామకృ ష్ణునితో చెప్పారు. వాడిని బ్రాహ్మడిని చేయకపోతే అగ్రహారాలు లాక్కుంటారు ప్రభువు. రాయలు పొద్దున్నే గుఱ్ఱం మీద స్వారీ చేస్తూ వాహ్యాళికెళ్లి వస్తున్నాడు. తుంగభద్రలో నల్లని కుక్కపిల్లను ముంచనూ తీయను చేస్తున్నాడు రామకృష్ణుడు.

'' ఇవాళ కుక్కని పట్టావెందుకూ? చంపుతావా? దాన్ని వదిలేయ్'' అన్నారు రాయలువారు.

'' వదిల్తే యెలా మహారాజా! తనను తెల్లబడేయమని కోరితే యిలా చేస్తే తెల్లబడతావు అంటే ఒప్పుకున్నది. మీరిక్కడే వుండండి మహారాజా. ఇప్పుడే తెల్ల కుక్కపిల్ల తయారౌతుంది''. పదవేపద అని కుక్కపిల్ల మెడతాడు పట్టుకుని నీళ్ళల్లో ముంచి తీస్తుంటే అది యేడుపు. రాయలుకి తన తప్పు తెలిసివచ్చి, నవ్వుతూ ''దాన్ని వదిలేయ్. ఇవాళ దర్బారులో వాడిని బ్రాహ్మడుగా మార్చక్కర్లేదని ఆజ్ఞాపిస్తా'' అని కుక్కను వదిలించాడు రాయలు. తల్లి సంతృ ప్తి కోసం బంగారు మామిడిపళ్లు దానమిస్తుంటే ఖజానా గుల్ల కాబోతున్నది.

రామకృష్ణుడు నడ్డిమీద వాతలు పెట్టి, యెన్ని వాతలుంటే అన్ని పళ్లు లభిస్తాయని నమ్మించాడు. రెండు కావాలని అడిగిన బ్రాహ్మడి ద్వారా రాయలుకి ప్రమాదం తెలిసి పట్టి తెమ్మన్నాడు. రామకృష్ణుని తెచ్చారు భటులు.

''స్వర్గస్థురాలైన రాజమాతకు మామిడిపళ్లు అందుతుంటే, నడ్డినెప్పితో బాధపడుతూ ''వాతలు పెట్టమని యేడుస్తూ చనిపోయిన మా తల్లికి వాతలు అందవా? నేనప్పుడు వాతలు వడ్డించలేదు. ఆమె కోర్కె తీరలేదు. ఆమె సంతృప్తి కోసం పెట్టాను. ఇవీ ఆమెకు చేరతాయి'' అన్నాడు దుఃఖిస్తూ.

రాయలుకి తన తెలివితక్కువతనం తెలిసివచ్చి ఆపించాడు. బ్రాహ్మలు తీసుకున్న బంగారు పళ్లు యిచ్చేశారు.

అంతకంటే ప్రమాదం వచ్చింది. రాయలు సప్తాంగాల మీద అధికారమిచ్చాడు ఒక కవికి. తిమ్మరుసు రామకృష్ణునితో చెప్పాడు ఆపద.

''రామకృష్ణా, యేలినవారు రాజ్యం కోల్పోతున్నారు''.

రామకృష్ణుడంతా విన్నాడు. ఆ కవి యొక్క గురువు వేషం వేసి పల్లకీలో కూచుని, శిష్యులు మోయగా సభకి వచ్చేశాడు.

''గురుదక్షిణ యీయకుండా వచ్చావేం శిష్యా? మరిచావే. గొప్పవాడివైనావు. ఇపుడన్నాయియ్యి'' అన్నాడు.

''యేమిస్మన్నారు గురూ?'' అడిగాడు శిష్యుడు దర్పంగా.

''రెండు అంగాల మీద అధికారం ధారపోస్తే, నీకింక చాలా వున్నాయి శిష్యా. నాకు రెండు చాలు పోతా'' అన్నాడు.

మంత్రపూర్వకంగా రెండు అంగాల మీద అధికారం సంపాయించాడు గురువు. పోతే నీకు పంచాంగాలున్నాయని దానం పట్టిన చోటే కూచుని, పంచాంగాల కట్ట విప్పి ఒక్కొక్కటే శిష్యునికివ్వసాగాడు రామకృష్ణ. పరాభవ నామ పంచాంగం అని చదువుతూ అందించాడు. కవికి తన దురాశ తెలిసి వచ్చింది. రాయలుకి తన తొందరపాటూ వ్యసనం తెలిసి వచ్చాయి. కవి రామకృష్ణుని కాళ్లకు

మొక్కి ''నన్ను క్షమించి పంపేయండి గురూ. తప్పే చేశాను'' అని ఒప్పుకున్నాడు.

ఒక విధంగా చూస్తే బలి చక్రవర్తి వ్యసనానికే గురైనాడు. అతి సర్వత్రవర్జయేత్ అని వుక్తి. జగద్గురువూ ఆదిశంకరులూ గురువుల ఆజ్ఞ మీదే ఆసేతు హిమాచలం పాదయాత్ర చేస్తూ మనుషుల అజ్ఞానం, స్వార్థం, వ్యసనం అర్థం చేసుకుని గొప్ప కవి అయి, సులభశైలిలో భజగోవిందం అల్లారు. ఉదర నిమిత్తం బహూకృత వేషం అన్నారు. ఆ కవనం ప్రజలలోకి పాకిపోయింది. నేటికీ వున్నది. ప్రజాకవి వేమన పద్యాలు అలాగే వ్యాప్తి చెందాయి. అయన దేశాటన చేసి స్ఫోర్టివ్‌గా తీసుకుని అల్లాడు ఆటవెలది. జాతీయపిత బాపుగూడా వుద్యమం నడపబోయే ముందు భారతదేశమంతా గ్రామాల వెంట తిరిగి ప్రజల దైన్యస్థితి గ్రహించారు. వుద్యమాన్ని ప్రజల మధ్యకి తీసికెళ్లారు. అంతకుముందు ఆ వుద్యమం మేధావుల మధ్య వుండేది.

బంధువులలో రకరకాల వ్యసనపరులను చూసే యిలా చెప్పగలుగుతున్నాను. నాకు వేలు విడిచిన మేనత్త వుండేది. మీ అమ్మాయి వ్యసనమే ఆవిడలో చూసి, అనుభవించి యివాళిలా మాట్లాడగలుగుతున్నాను. పెద్దల్లుడే బిరుదులిచ్చాడత్తగారికి. ''చత్రాతనారదీయగలదు'' ''నిలువుదోపిడీ'' వచ్చు. ''కోల్పోయిన వాడికే ఆమె తత్త్వం తెలిసివస్తుంది. డబ్బు లాగాలనే వస్తుంది. ఇల్లు వదిలి బయలుదేరటంలో అదే ఐడియా. చేతి సంచీలో కోర్టు కాగితాలూ, నోట్లో లా పాయింట్లూ నాట్యమాడతై. మోసబోవటానికిష్టపడక, డబ్బు రాల్చకపోతే, తిట్లూ దూషణా, గుడ్లురుమటం, చెప్పటం సాగిస్తుంది. భయపెట్టాలని ట్రై చేస్తుంది. కిలకిలా నవ్వి, వలావలా యేడ్చి నయవంచన చేస్తుంది. మూటగట్టుకు నిర్గమిస్తుంది. ఈ హై డ్రామా చూసినవారు బిత్తరపోతారు. నక్కకు మాటలొస్తే యిలా మాట్లాడుతుందా అనిపిస్తుంది. ''డబ్బంటే తృణప్రాయం. మగవాడంటే రోత'' అలా వ్యసనం బైట పడనీయకపోతే నరాలు జివ్వున లాగుతాయి ఆమెకి. గొప్పవారిలోనూ యీ వ్యసనాలుంటాయి. మేరీ రాణి తల్లికి డబ్బు కంటబడకపోతే, పెద్దగా అరిచి

హిస్టీరియగా ఎటాక్ అయి మూర్ఛపోయేదట. భర్త రాజు గారు. పొదుపరిగూడాను. కూతురు మేరీ రాణి యిల్లు మానేజ్‌చేసి మర్యాద నిలబెట్టేది. ముగ్గురు చక్రవర్తులు పోవటం చూసిందామె. మామగారూ, భర్తా, కొడుకు ఇప్పటి రాణీ నాయనమ్మే ఆమె.

మరొక బంధువు నదరైనవన్నీ అడిగి తీసికెళ్తుంది. ఇవ్వనిదీ వదలదు. వెళ్లదు. మళ్లా యిస్తా అంటుంది. అదీ వ్యసనమే. మాటల్లో చాలా దర్పం, డాబూ వినిపిస్తుంది.

''అందరూ కోల్పోతారంటారా?'' గోపాలం గారడిగారు.

''కోల్పోకపోవచ్చు. అచ్చుకోకపోవచ్చు. రాల్చరు గూడాను. కాని ఆ వ్యసనాన్ని గుర్తిస్తారు తప్పకుండా. తమను తాము కాపాడుకుంటూ సభ్యత చూపుతూ స్పోర్టివ్‌గా తీసుకుంటారు. విరుగుడు కనిబెడతారు. బైటబడరు''.

''బావుందిగానీండీ పెళ్లి మాటేమంటారు?''

''రోగిష్టీ, సోమరీ, అల్పాయుష్కులూ, అన్ని తరగతులవారూ దైవం మీద భారం వేసి పెళ్లిళ్లు చేసుకుంటుంటే వాసంతికి మానేయక్కర్లా. పెళ్లి కుదిరితేగాని పిచ్చి కుదరదు. పిచ్చి కుదిరితే గాని పెళ్లి కుదరదు. అని హాస్యంతో కూడిన సామెత వున్నది''.

''దుష్ఫలితాలుండవూ?''

''అందుకే దైవభీతి సాధన చేయించండి, అన్నాను'' అంటుండగా యిద్దరమ్మాయిలు వచ్చేశారు. వాసంతి చేతిలో పూలబుట్ట పరిమళం విరజిమ్ముతున్నది.

శివకామి దీపంవేసి దణ్ణం పెట్టింది.

''వాసంతి చాలా సంతోషించింది నాన్నా. తోటపని నేనూ నాన్నా చేస్తాము అని చెప్తే, ''నేనూ పూలతోట పెంచుతాను'' అన్నది.

శివకామి లోపలికెళ్లి వచ్చి బోండాలు నాలుగు తాడుతో కట్టినవి గోపాలంగారి కందించింది. ''వస్తూ వుండండి'' అన్నది.

''తప్పకుండా తల్లీ!'' అన్నాడాయన.

''కాటుకకొండల వంటి కర్మము లెడబాపే రామనామమనే మందు వాడండి'' అని చమత్కరిస్తూ తండ్రీ కూతుళ్లను గేటుదాకా సాగనంపి వచ్చాడు నరసయ్య.